విమాన ప్రమాదంపై జిల్లా నేతల దిగ్భ్రాంతి

వద్దిరాజు, తాతా, పువ్వాడ, నామా తదితరుల సంతాపం

ఖమ్మం, జూన్ 12: గుజరాత్‌లోని అహ్మదాబాద్ వద్ద గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదంపై జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలైన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తమ సంతాపాన్ని తెలియజేశారు. అహ్మదాబాద్ నుంచి లండన్ పయనమైన విమానం కొద్దిసేపట్లోనే ఒక కాలేజీ భవనంపై కుప్పకూలడం, ప్రయాణికులతోపాటు స్థానికులు, మెడికోలు మృతిచెందడం అత్యంత బాధాకరమని అన్నారు. ఇటువంటి ప్రమాదాలు భవిష్యత్తులో జరుగకుండా కేంద్ర ప్రభుత్వం అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బాధిత కుటుంబాలకు 'అజయ్' పరామర్శ

వెంకటకృష్ణ ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, జూన్ 12: మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం నగరంలో గురువారం పర్యటించారు. పలు డివిజన్లలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. 30వ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు గౌరోజు వసంత్‌బాబు ఇటీవల తొంటికి శస్త్రచికిత్స చేయించుకోగా ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకొని రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం టీఎన్‌జీవోస్ మహిళా విభాగం జిల్లా మాజీ అధ్యక్షురాలు శాభాసు జ్యోతి భర్త వెంకటకృష్ణ ప్రసాద్ ఇటీవల మృతిచెందగా ఆయన దశదిన కర్మల కార్యక్రమానికి అజయ్ హాజరై.. అతడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆ తరువాత ఖమ్మానికి చెందిన ప్రముఖ వ్యాపారి కటకం గిరి తల్లి కటకం అనసూయమ్మ ఇటీవల మరణించగా వారి ఇంటికి వెళ్లి ఆమ చిత్రపటానికి పూలమాల వేశారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్, ఆర్‌జేసీ కృష్ణ, కర్నాటి కృష్ణ, పసుమర్తి రామ్మోహన్ రావు, రుద్రగాని ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలి

కొనుగోలుదారుల రద్దీ దృష్ట్యా అవసరమైన వసతులు కల్పిస్తాం: కలెక్టర్

ఖమ్మం, జూన్ 12: వ్యాపారులు, కొనుగోలుదారులకు అనుగుణంగా, సౌకర్యవంతంగా వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మం నగరంలోని గురువారం పర్యటించిన ఆయన.. పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మార్కెట్‌కు కావాల్సిన అదనపు వసతులు, జరుగుతున్న నిర్మాణ పనులపై పలు ఆదేశాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. వీధి వ్యాపారుల ప్రాంగణంలో కొనుగోలుదారుల రద్దీ దృష్ట్యా మరిన్ని వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. మార్కెట్ బయట ఉన్న పబ్లిక్ టాయిలెట్లను మరో ప్రాంతంలో ఏర్పాటుచేయాలన్నారు. కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లా, ఈఈ కృష్ణలాల్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలో కోఆపరేటివ్ అధికారుల విచారణ

ఖమ్మం రూరల్, జూన్ 12: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని చిన్నతండా వద్దగల ఏదులాపురం సొసైటీ కార్యాలయంలో గురువారం జిల్లా కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిష్ట్రార్లు జీ.ఉష్శ్రీ, రామిరెడ్డి విచారణ చేపట్టారు. వారం రోజుల నుంచి మండలంలోని గుండాలతండాతో పాటు ఇతర గ్రామాలకు చెందిన కొందరు రైతులు సొసైటీ చైర్మన్‌పై ఫిర్యాదులు చేశారు. అధికారులు 11మంది రైతుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం సొసైటీ చైర్మన్ జర్పుల లక్ష్మణ్ నాయక్ వివరణ తీసుకున్నారు. 2023 సంవత్సరంలో పంట రుణాలు తీసుకున్న సమయంలో మా వద్ద నుంచి చైర్మన్ కొంత నగదును తీసుకున్నారని అధికారులకు తెలిపారు. తీసుకున్న రుణాలలో సగం వరకు చైర్మన్ తీసుకొని మిగిలిన సొమ్ము మాకు అందజేశాడని రైతులు తెలిపారు. సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ తనపై కావాలని అసత్య ఆరోపణలు చేస్తున్నారని, రుణాలు మంజూరు చేయడమే మా బాధ్యత అని, మంజూరు అనంతరం నేరుగా వారి ఖాతాలలోనే క్రెడిట్ అవుతాయన్నారు. ఈ ఆరోపణలతో తనకు ఏమాత్రం సంబంధం లేదని వివరణ ఇచ్చారు.

'బాల కార్మిక వ్యవస్థ అంతానికి ఉద్యమం చేద్దాం'

ఖమ్మం అర్బన్, జూన్ 12: బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడానికి అందరమూ కలిసి ఒక జాతీయ ఉద్యమంలో మారినప్పుడే ఈ వ్యవస్థ అంతమవుతుందని బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ భారతీరాణి అభిప్రాయపడ్డారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మం ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. హరిప్రసాద్, వెంగమాంబ, భాస్కర్, శ్రీనివాస్, రాందాస్, రవిచంద్ర, రవీంద్ర, సతీష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

ఖమ్మం అర్బన్, జూన్ 12: తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి దూర విద్యా విధానంలో టెన్త్, ఇంటర్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందేందుకు షెడ్యూల్ విడుదలైనట్లు డీఈవో సామినేని సత్యనారాయణ, కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి జూలై 11 వరకు ఎలాంటి అపరాధ రుసుమూ లేకుండా ప్రవేశాలు పొందవచ్చునని అన్నారు. ఇతర వివరాలకు 8008403522 నంబరులో సంప్రదించాలని కోరారు.

వరిసాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి

ఖమ్మం రూరల్, జూన్ 12: వరిసాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తే చీడపీడల ఉధృతి తగ్గించవచ్చని భారతీయ వరి పరిశోధన సంస్థ ప్రిన్సిపల్, సైంటిస్టు డాక్టర్ పద్మావతి అన్నారు. వికసిల్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుదిమళ్ల గ్రామంలో మండల వ్యవసాయశాఖ అధికారి ఉమానగేష్ అధ్యక్షతన జరిగిన రైతు అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. తక్కువ ఖర్చుతోఅధిక దిగుబడి సాధించుకునేందుకు గాను నేరుగా విత్తే పద్ధతి వరిసాగులో అవలంబించాలన్నారు. కేవీకే సైంటిస్టు డీ.నరేష్ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఆదర్శ్, రైతులు పాల్గొన్నారు.

'బడిబాట'లో నేను సైతం..

స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న రిటైర్డు హెచ్ఎం

రఘునాథపాలెం, జూన్ 12: ఉద్యోగ విరమణ చేసినా తన వృత్తి ధర్మాన్ని విస్మరించకుండా ప్రభుత్వ విద్యను ప్రోత్సహిస్తున్నారు ఓ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు. తాజాగా నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న 'బడిబాట' కార్యక్రమంలోపాల్గొంటూ, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తూ ఉపాధ్యాయ వృత్తికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. అతడే.. వీ వెంకటాయపాలెం ప్రాథమిక పాఠశాల రిటైర్డు హెచ్ఎం వేమిశెట్టి మోహన్‌దాసు. 2024 జూన్‌లో ఉద్యోగ విరమణ చేసిన ఆయన.. ఇప్పటికే తన వృత్తి ధర్మం కోసం పాటుపడుతూనే ఉన్నారు. ఇందులో భాగంగా ఇటీవల ఖమ్మం నగర శివారు వెలుగుమట్ల కాల్వకట్ట చెంత పర్యటించారు. ఆ ప్రాంతంలోని నిరుపేద తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్నారు.

ఎర్రుపాలెం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

నూతన విద్యా సంవత్సరం ప్రారంభం

- తొలి రోజున తరగతులకు నామమాత్రంగా హాజరైన విద్యార్థులు
- పలు పాఠశాలల్లో బుక్స్, యూనిఫాం పంపిణీ చేసిన అధికారులు
- ఎర్రుపాలెంలో విద్యార్థులు లేని స్కూల్‌ను పునఃప్రారంభింపజేసిన ఏసీ

ఖమ్మం జిల్లాలో గురువారం నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. పలు పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి.. తొలిరోజు తరగతులకు హాజరైన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ పంపిణీ చేశారు. కొన్ని పాఠశాలల్లో మొదటి రోజు తరగతులు పరిశీలించేందుకు ఉన్నతాధికారులు, విద్యాశాఖ అధికారులు హాజరయ్యారు. ఇందులో భాగంగా ఎర్రుపాలెం మండలంలోని పలు పాఠశాలలను అదనపు కలెక్టర్ శ్రీజ పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం, ఇదే మండలంలోని చొప్పకట్లపాలెం హరిజనవాడ పాఠశాలను పరిశీలించారు. అయితే, విద్యార్థులు లేని కారణంగా ఇదివరకే ఈ పాఠశాలను అధికారులు మూసివేశారు. కాగా, గురువారం ఇక్కడికి వచ్చిన అదనపు కలెక్టర్.. ఈ పాఠశాలను పునఃప్రారంభించారు. ఈ పాఠశాలలో కనీస సంఖ్యలోనైనా విద్యార్థులను చేర్పించే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని, ఈ మేరకు గ్రామంలోకి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించాలని, వారి పిల్లలు ప్రభుత్వ స్కూలుకు పంపేలా వారికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎంఈవో మురళీమోహన్‌రావు, ఎంపీడీవో సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. వేంసూరు మండలంలోనూ, సత్తుపల్లి పట్టణంలోనూ స్థానిక ఎమ్మెల్యే రాగమయి పర్యటించారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ బడిబాటను కూడా ప్రారంభించారు. బోనకల్లు మండలంలో కార్మిక శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి పర్యటించిన పలు పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ అందజేశారు. కాగా, విద్యాసంవత్సరం ప్రారంభం రోజున చాలా స్కూళ్లలో విద్యార్థులకు తక్కువ సంఖ్యలోనే హాజరయ్యారు.

-నమస్తే నెట్‌వర్క్, జూన్ 12

ఆర్జేసీ విద్యార్థినికి రెండు స్వర్ణ పతకాలు

ఖమ్మం అర్బన్, జూన్ 12: కాకతీయ యూనివర్సిటీ ప్రకటించిన ర్యాంకుల్లో తమ విద్యార్థిని సాయి వీర సుప్రియ రెండు స్వర్ణ పతకాలు సాధించినట్లు ఖమ్మం ఆర్జేసీ డిగ్రీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ గురువారం తెలిపారు. జూలై 7న జరిగే స్నాతకోత్సవంలో గవర్నర్ నుంచి తమ విద్యార్థిని ఆ బంగారు పతకాన్ని అందుకోనున్నట్లు చెప్పారు. బంగారు పతకాన్ని సాధించిన విద్యార్థినిని ప్రిన్సిపాల్ అలవాల లింగయ్య, ఇన్‌చార్జి ఆంజనేయులు అభినందించారు.

'14న జాతీయ లోక్ అదాలత్'

ఖమ్మం లీగల్, జూన్ 12: ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జీ.రాజగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ పడదగ్గ కేసుల్లో రాజీ పడి సత్వర న్యాయం పొందాలని సూచించారు. వినియోగదారుల కేసులు పరిష్కరించుకొని లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలని కోరారు.

15 నుంచి గిరిజన గ్రామాల్లో సదస్సులు: కలెక్టర్

మామిళ్లగూడెం, జూన్ 12: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి దర్తీ ఆబాజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమం అమలులో భాగంగా ఈ నెల 15 నుంచి 30 వరకు గిరిజన గ్రామాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గిరిజన వికాసం, సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న ఈ పథకం కింద ఖమ్మం జిల్లాలోని 35 గిరిజన గ్రామాలను ఎంపిక చేసినట్లు చెప్పారు.

రేషన్‌షాపు తనిఖీ

వైరాటౌన్, జూన్ 12: వైరాలోని సుందరయ్య నగర్‌లో గల రేషన్‌షాపును సివిల్ సప్లయ్ డీఎస్‌వో చందన్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. రేషన్ షాపులోని స్టాకు, రికార్డులను పరిశీలించారు. రేషన్‌కార్డుదారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మూడు నెలల రేషన్‌ను ఈనెల 30వ తేదీ వరకు సరఫరా చేయాలన్నారు. సివిల్ సప్లయ్ ఆర్ఐలు వెంకటేశ్వరరావు, కిరణ్, ఇన్‌చార్జి రేషన్ డీలర్ వెంకటేశ్వరరావు, కృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ విభాగంలో ఖాళీల భర్తీకి పోటీలు

ఖమ్మం సిటీ, జూన్ 12: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆదేశానుసారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అనుమతితో ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీలో ఖాళీల భర్తీకి గురువారం ఎంపికలు నిర్వహించారు. ఖమ్మం పటేల్ స్టేడియంలో జరిగిన పోటీలకు 10 (ఖమ్మం, భద్రాద్రి, వరంగల్, సూర్యాపేట, నారాయణపేట్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, మంచిర్యాల, సంగారెడ్డి) జిల్లాలకు చెందిన మొత్తం 30 మంది హాజరయ్యారు. వారికి జనరల్, ఫిజికల్ టెస్ట్, సంబంధిత పరీక్షల నిర్వహించారు. గతంలో ఆడిన సర్టిఫికెట్ల ఆధారంగా వైద్యులతో వయసు వెరిఫికేషన్ చేయించారు. ఆయా ప్రక్రియలను జిల్లా యువజన, క్రీడల శాఖ అభివృద్ధి అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి, ఎస్ఏటీజీ కోచ్ శ్రీనివాసరావు, ఎండీ షఫీక్ అహ్మద్, ఎండీ గౌస్, ఎండీ అక్బర్‌అలీ, అసిస్టెంట్ మేనేజర్ ఉదయ్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

భూభారతితో భూ సమస్యలు పరిష్కారం

ఎర్రుపాలెం, జూన్ 12: భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఆర్డీవో జీ.నర్సింహారావు అన్నారు. గురువారం మండలంలోని మామునూరు, లక్ష్మీపురం గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని తమ భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. మామునూరు 178, లక్ష్మీపురం 26 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ఉషాశారద, ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, మాజీ సర్పంచ్ వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఆర్ఐలు రవికుమార్, రాజశేఖర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జలగంనగర్‌లో 'అమ్మమాట- అంగన్‌వాడీ బాట'

సత్తుపల్లిటౌన్, జూన్ 12: పట్టణంలోని జలగంనగర్ అంగన్‌వాడీ భవనంలో 'అమ్మమాట- అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రారంభించారు. చిన్నారులకు ఎమ్మెల్యే సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులు అమ్మఒడి తర్వాత వారిలాలనా పాలన చూసుకునేది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనందబాబు, ఐసీడీఎస్ సీడీపీవో, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమునగాలలో..

కొణిజర్ల, జూన్ 12: మండలంలోని పెద్దమునగాల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట- అంగన్‌వాడీ బాట నిర్వహించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూవో కే.రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ 3- 6 సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీలోనే చేర్పించి ఆటపాటలు, చదువు పిల్లల సమగ్ర అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో సీహెచ్.కమలప్రియ, ఏసీడీపీవో ఎం.ఉషారాణి, సూపర్‌వైజర్ ఎం.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

ప్రతి ఒక్కరూ దీనిని బాధ్యతగా భావించాలి

అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి తుమ్మల

ఖమ్మం, జూన్ 12: ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి ఒక్కరూ దీనిని తమ బాధ్యతగా భావించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం నగరంలోని గురువారం పర్యటించిన ఆయన.. వివిధ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 5వ డివిజన్ ఖానాపురంలో రూ.50 లక్షల టీయూఎఫ్ఐడీసీ నిధులతో నిర్మించనున్న స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రజల సహకారం వల్లనే ఖమ్మం నగరం పరిశుభ్రంగా ఉంటుందని అన్నారు. ఈ సహకారం మరింత కొనసాగించాలని కోరార. ఖమ్మం నగరం.. ఇక్కడి ప్రజలకు మాత్రమే చెందుతుందని అన్నారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులు, మంత్రులు మారుతూ ఉంటారని అన్నారు. కానీ ప్రజలు మాత్రం తరతరాలుగా ఇక్కడే నివసిస్తుంటారని అన్నారు. కాబట్టి మనమంతా మన నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. నగరంలో పెరుగుతున్న జనాభా ప్రకారం అవసరమైన సౌకర్యాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలు చేయడం పాలకుల బాధ్యత అని అన్నారు. కేఎంసీ మేయర్ నీరజ, అదనపు కలెక్టర్ శ్రీజ, ఏఎంసీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీవో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాల బాధిత రైతులకు నష్ట పరిహారం

ఖమ్మం లీగల్, జూన్ 12: కల్తీ విత్తనాల బాధిత రైతలకు నష్ట పరిహారాన్ని చెల్లించాలని ఆదేశిస్తూ ఖమ్మం జిల్లా వినియోగదారుల ఫోరం గురువారం తీర్పునిచ్చింది. ముదిగొండ మండలంలోని గోకినేపల్లి, కట్టకూరు గ్రామాలకు చెందిన 26మంది రైతులు 2021 లో గజ్వేల్‌కు చెందిన సిరి ఫెర్టిలైజర్స్ గజ్వేల్, మహారాష్ట్రకు చెందిన మాన్సూర్ సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల నుంచి విత్తనాలు కొనుగోలు చేశారు. 114ఎకరా ల్లో విత్తనాలు నాటడం కోసం ఒక ఎకరానికి ఒక ప్యాకెట్ సరిపోతుందని కంపెనీల బాధ్యులు చెప్పడంతో ఆ 26 మంది రైతులు 114 ఎకరాలకు సరిపడేలా సన్ ఫ్లవర్ సీడ్స్, హైబ్రీడ్ఎఫ్1 సన్ గోల్డ్, పొద్దుతిరుగుడు విత్తనాలు కొనుగోలు చేశారు. ఆ తరువాత వారు ఆ విత్తనాలు విత్తినప్పటికీ సరైన రీతిలో పంట చేతికి కాలేదు. దీంతో సదరు రైతులు వెంటనే ముదిగొండ ఏవో ద్వారా డీఏవోకు ఫిర్యాదు చేశారు. ఆయన రిఫరెన్స్ మేరకు ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వచ్చి ఆ పంటను భౌతికంగా పరిక్షించి రిపోర్టు ఇచ్చారు. వారు నాటింది నకిలీ విత్తనాలని ఆ రిపోర్టు లో తేలింది. దీంతో రైతులు ఖమ్మం వినియోగ దారుల ఫోరంలో కేసును ఫైల్ చేశారు. సాక్ష్యాధారాలను, కేసు ల పూర్వపరాలను పరిశీలించిన ఫోరం.. మొత్తం 26మంది రైతులకు రూ. 17.50 లక్షలను నష్ట పరిహారంగా చెల్లించాలని తీర్పునిచ్చింది. అదేవిధంగా కొనుగోలు చేసిన విత్తనాల ఖర్చుల కింద ప్రతి రైతుకూ ఆ ప్యాకెట్ విలువతోపాటుగా రూ. 10వేలను కేసు ఖర్చుల కింద చెల్లించాలని విత్తన కంపెనీలను ఆదేశిస్తూ వినియోగదారుల ఫోరం ప్రెసిడెంట్ వీ.లలిత, మెంబర్ ఏ.మాధవీలత ఉత్తర్వులిచ్చారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు

మధిర, జూన్ 12: బాలల హక్కులను పరిరక్షించడం మనందరి బాధ్యత అని, బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని న్యాయ సేవా అధికార సంస్థ చైర్‌పర్సన్, మధిర కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎన్.ప్రశాంతి హెచ్చరించారు. గురువారం అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మధిర కోర్టు ప్రాంగణంలో జరిగిన న్యాయ చైతన్య సదస్సులో ఆమె మాట్లాడారు. మధిర కోర్టు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి మాట్లాడుతూ మధిర ప్రాంతంతో ఏ షాపులో అయినా ఇంట్లో అయినా ఎట్టి పరిస్థితుల్లో పనిలో పెట్టుకోకుండా చూడాలని కోరారు. మధిర కార్మిక అధికారి కే. చందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజడ్ల పుల్లారావు, సీనియర్ న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, నంబూరి జనార్ధన్‌రా వు, దిరిశాల జగన్మోహన్‌రావు, జే.రమేశ్, ఎన్.రవి, టీ. వెంకటరావు, ఎన్.రవి, టీ.వెంకటరావు, ఎస్.సునీత, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు: కలెక్టర్

అధికారులు, స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం రూరల్, జూన్ 12: ప్రత్యామ్నాయ ప్రభుత్వ స్థలంలో శ్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని జలగనగర్ సమీపంలోగల డాడీ లంబాడ శ్మశానవాటికను అధికారులు, స్థానికులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ వరదల నుంచి రక్షణ కోసం నిర్మించే కరకట్ట డిజైన్‌లో ఎటువంటి మార్పులు, తగ్గించడం అవసరం లేదన్నారు. కరకట్ట నిర్మాణంలో శ్మశాన వాటిక భూమి కొంతమేర కోల్పోతున్నందున కొత్తగా సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో శ్మశాన వాటిక ఏర్పాటు చేసి, అక్కడ రోడ్డు, కంపౌండ్ వాల్, ఇతర సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న స్మశాన వాటిక సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించి వారం రోజుల్లో అనుకూలమైన స్థలం ఎంపిక చేసి ప్రతిపాధనలు అందించాలని కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ పీ.రాంప్రసాద్, ఎంపీడీవో ఎస్ కుమార్, కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి ఆదేశాలు

అండర్‌బ్రిడ్జి సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

మధిర, జూన్ 12: మధిర మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే అండర్‌బ్రిడ్జి సమీపంలో కల్వర్టు నిర్మాణానికి అదనపు కలెక్టర్, మున్సిపాలిటీ స్పెషలాఫీసర్ శ్రీజ ఆదేశాలు జారీ చేశారు. గురువారం అదనపు కలెక్టర్ మధిరలో పర్యటించారు. ఇటీవల మహిళలు లడకబజార్ సమీపంలో నివాస ప్రాంతాలకు చెందిన ప్రజలు వర్షపునీరు వెళ్లేందుకు రైల్వే అండర్‌బ్రిడ్జి సమీపంలో కల్వర్టు నిర్మించాలని గతంలో కోరారు. సమస్య పరిష్కారానికి రైల్వే అండర్‌బ్రిడ్జి ప్రాంతాన్ని గురువారం ఆమె పరిశీలించారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు సమస్య పరిష్కారం కోసం పనులు చేపట్టాలని రైల్వే అధికారులకు, మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

విపత్తు సమయాల్లో తక్షణం స్పందించాలి

కూసుమంచి, జూన్ 12: ప్రకృతి విపత్తులు ఏవి చెప్పిరావని, అవి వచ్చిన సమయాల్లో తక్షణం స్పందిస్తే నష్టం జరగకుండా ఉంటుందని, సమస్యాత్మక ప్రాంతాలపై ఎప్పుడూ నిఘా ఉంచాలని విపత్తు నివారణ అధికారులు తెలిపారు. గురువారం మండలంలోని నాయకన్‌గూడెం వద్ద పాలేరు రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌తో మునిగే ఇళ్లను పరిశీలించారు. గతంలో వచ్చిన వరదలు, జరిగిన నష్టం వివరాలను తహసీల్దార్ రవికుమార్, ఎంపీఈవో రామచందర్‌రావు, కలెక్టరేట్ టీడీ కరుణాకర్‌రెడ్డి అధికారులకు వివరించారు. సుమారు 100 మంది ఉమ్మడి జిల్లా విపత్తు నివారణ బృందం నాయకన్‌గూడెం, పాలేరు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం కూసుమంచిలో ఏర్పాటుచేసిన సమావేశంలో విపత్తు సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వరదల సమయంలో వరదల్లో కొట్టుకు పోయిన ఇంటి స్థలం, ప్రైటోల్ బంక్, పాలేరు రిజర్వాయర్ అలుగు, కాలువను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై సురేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో లాభాలు

కూసుమంచి, జూన్ 12: రైతులు ఒకే రకమైన పంటలు వేయడం, విత్తనా